
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com


## శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



**అక్షరటుడే, మెండోరా:** శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం తగ్గిపోయింది. ఎగువన వర్షాలు లేకపోవడంతో జలశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లోకి 1,013 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు, పూర్తి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1079.50 అడుగుల వద్ద 43.669 టీఎంసీల నీటినిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 482 క్యూసెక్కులు నీళ్లు బయటకు వెళ్తున్నాయి.





పాలన మహిళలను భాగస్వామ్యం చేయడానికి ప్రభుత్వం రిజర్వేషన్ అమలు చేస్తోంది. స్థానిక సంస్థల్లో అతివలకు 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది. దీంతో మహిళలు గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. అయితే పాలనలో మాత్రం వారు నామమాత్రంగా మారిపోయారు. పేరుకు సర్పంచ్ అయినా.. పెత్తనం అంతా వారి కుటుంబంలోని పురుషులే చూసుకుంటున్నారు. భర్త, కుమారులు షాడో సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. - అక్షరటుడే, డిచ్‌పల్లి

# సర్పంచ్ భర్తల పెత్తనం

- అనధికార జోక్యంతో గాడితప్పుతున్న పల్లెలు
- అధికారులకు వరుస ఫిర్యాదులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం

జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో ప్రజాస్వామ్య పాలనకు బదులు 'షాడో సర్పంచ్'ల పెత్తనం చర్చనీయాంశంగా మారుతోంది. మహిళా సర్పంచ్‌లు అధికారికంగా బాధ్యతలు చేపట్టినా.. వారి భర్తలు పంచాయతీ పాలనలో అనధికారికంగా జోక్యం చేసుకుంటూ అన్ని తామై నడిపిస్తున్నారనే ఆరోపణలు తీవ్రరూపం దాల్చడం గమనార్హం. పంచాయతీల్లో అధికారిక నిర్ణయాలు తీసుకోవడం, సిబ్బందిపై ఆదేశాలు జారీ చేయడం, అభివృద్ధి పనుల విషయంలో జోక్యం చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే విమర్శలు నెలకొన్నాయి. పదవి లేకపోయినా.. సర్పంచ్ భర్తల అనధికార పెత్తనం, నిర్ణయాల్లో జోక్యం గ్రామాల్లో కొత్త వివాదాలకు కారణమవుతోందన్న ఆరోపణలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. పంచాయతీ నిర్ణయాలు తీసుకోవడం, గ్రామసభల్లో ప్రధాన పాత్ర పోషించడం వంటి పనులతో ఈ 'షాడో సర్పంచ్‌ల' పెత్తనం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

### అధికారాల దుర్వినియోగం

గ్రామ పంచాయతీల్లో నిబంధనలు, రాజ్యాంగ సూత్రాలను పక్కన పెట్టి అనధికార వ్యక్తులు పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్న వైనం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. పంచాయతీ చెక్కులపై సంతకాల నుంచి నిధుల వినియోగం వరకు సర్పంచ్‌ల భర్తలే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. పనుల పేరిట నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందిపై హెచ్చరికలు జారీ చేస్తూ, తమకు అనుకూలంగా పనిచేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన గ్రామసభల్లో సర్పంచ్ స్థానంలో భర్తలే అన్నీ తానై నడిపిస్తూ, ప్రజల ప్రశ్నలను గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారు. మహిళా సర్పంచుల భర్తల పెత్తనం గురించి అధికారులకు తెలిసినా.. పట్టించుకోవడం లేదు.

### ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం

పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధి మాత్రమే అధికార విధులు నిర్వహించాలి. వారి భర్తలు, కుటుంబ సభ్యులు పంచాయతీ పాలనలో జోక్యం చేసుకోవడం చట్టరీత్యా నేరం. గ్రామ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలు, సర్పంచ్ భర్తల పెత్తనాన్ని అడ్డుకోవడంలో చొరవ చూపాలి. నిధుల ఉపసంహరణ, అధికార నిర్ణయాల్లో మహిళా సర్పంచ్‌ల ప్రత్యక్ష భాగస్వామ్యం, సంతకాలు కచ్చితంగా ఉండాలి. సర్పంచ్ భర్తలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే ప్రత్యేక బృందాలతో విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలనే ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### కొన్ని ఘటనలు

- నిజామాబాద్ రూరల్ మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్‌కు బదులుగా ఆమె భర్త పెత్తనం చెలాయిస్తున్నారని మాజీ సర్పంచ్‌తో పాటు కొందరు గ్రామస్థులు ఇటీవల కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో మహిళా భవనానికి భూమి పూజ చేసిన స్థలంలో కాకుండా, మరో స్థలంలో నిర్మాణ పనులు చేయాలని చూస్తున్నారని, దీనిపై నిలదీస్తే అక్రమంగా కేసులు నమోదు చేయించారని వాపోయారు.
- గత గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయలేదన్న కక్షతో సర్పంచ్ భర్త తన ఇంటి నిర్మాణానికి సంబంధించి నోటీసు ఇచ్చారంటూ మద్నూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ అధికారులకు ఫిర్యాదు చేసింది.
- డిచ్‌పల్లి మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్ భర్త పంచాయతీ పాలన, ఆర్థిక లావాదేవీల్లో పెత్తనం చెలాయిస్తూ, సర్పంచ్ అధికారులను దుర్వినియోగం చేస్తున్నారని వార్డు సభ్యులు డీఎల్పీవోకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు.



## త్రివర్ణ కాంతుల్లో కామారెడ్డి కలెక్టరేట్

**అక్షరటుడే, కామారెడ్డి:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం త్రివర్ణ కాంతులతో కళకళలాడుతోంది. పై అంతస్తులు కాషాయం, మధ్యలో తెల్లని వెలుగులు, కింది భాగం పచ్చని దీపాలతో అలంకరించడంతో జాతీయ పతాకాన్ని తలపించే దృశ్యం ఆవిష్కృతమైంది. రాత్రి వేళ కలెక్టరేట్ ఆవరణలోని పచ్చని చెట్లు, పూల మొక్కలు, విద్యుత్ దీపాల వెలుగులో మెరిసిపోతూ దేశభక్తి వాతావరణాన్ని నింపుతున్నాయి. ఆగస్టు 15 పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా అధికారులు ఈ ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. కలెక్టరేట్ ను వీక్షించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. త్రివర్ణ కాంతుల్లో వెలిగిపోతున్న కలెక్టరేట్ ను చూసిన ప్రజలు దేశభక్తిని చాటుతూ సెల్ఫీలు దిగుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.



## నిజామాబాద్‌కు చేరుకున్న రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర శుక్రవారం నిజామాబాద్‌కు చేరుకుంది. యాత్ర అధ్యక్షుడు దొరయ్ వేలు ఆధ్వర్యంలో పెరంబదూర్ నుండి ఢిల్లీ వరకు కొనసాగనున్న 35వ యాత్రకు జిల్లాలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ డీసీసీ ఇన్‌ఛార్జి కౌడపు శరత్ కుమార్ యాత్రకు స్వాగతం పలికారు. అనంతరం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి భక్తవత్సలం, ఏఐసీసీ కోఆర్డినేటర్ ఘన్‌రాజ్, జిల్లా యూత్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజేంద్ర ప్రసాద్, జెండా గుడి ఛైర్మన్ లవంగ ప్రమోద్, మాజీ కార్పొరేటర్ కుడ్డుస్, బంటు బలరామ్, పోల ఉష, అపర్ణ, ఆకుల మహేందర్, జాఫర్, రాజ్ గగన్, సుమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## తిరంగా ర్యాలీతో గుండె నిండా దేశభక్తి ఉప్పొంగింది



తిరంగా ర్యాలీతో అందరి గుండె నిండా దేశభక్తి ఉప్పొంగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. - అక్షరటుడే, ఇందూరు








## తెయూలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ పరిపాలన భవనంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు ప్రారంభించారు. రెడ్ క్రాస్ సొసైటీతో మనం సమాజానికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయవచ్చని, తద్వారా సమాజానికి ఉన్నతమైన భావాలు, భవిష్యత్తును అందించవచ్చని వీసీ పేర్కొన్నారు. సమాజ సేవా ఒక్కటే మనకు గుర్తింపును, గౌరవాన్ని, సంతృప్తిని ఇస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన భవన ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ శనివారం జరగనుంది. దీనికి సంబంధించి జిల్లా కేంద్రంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈనెల 15న మధ్యాహ్నం 2 గంటలకు లబ్ధిదారులకు ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం జిల్లా అధికారులతో కలిసి భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌ను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రేషన్ కార్డులు కలిగి ఉన్న లబ్ధిదారులు, రేషన్ డీలర్లు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పేద కుటుంబాల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ వసతి ఉండాలని, వేదిక, సీటింగ్ అరేంజ్‌మెంట్, సౌండ్ సిస్టం, ఎల్ఈడీ స్క్రీన్లు తదితర



ఏర్పాట్లను పక్కాగా సరిచూసుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, జిల్లా రెవెన్యూ అధికారి గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీవో సందీప్, డీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీవో సాయన్న, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## ఎల్లారెడ్డిలో నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ సోమవారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని, 5,000కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. పదేళ్లుగా తన సొంత ఖర్చులతో జాబ్ మేళాలను నిర్వహిస్తూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. గతంలో తొలిసారిగా కామారెడ్డిలో టాటా జాబ్ మేళాను నిర్వహించినప్పుడు యువత నుంచి విశేష స్పందన లభించిందని గుర్తుచేశారు. 'ఒక ఇంట్లో ఒకరికి ఉద్యోగం వస్తే.. ఆ కుటుంబం మూడు పూటలా కడుపునిండా భోజనం చేస్తుంది' అనే నినాదంతో నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తున్నామని మదన్ మోహన్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి నిరుద్యోగ యువతీ యువకుడు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొని తమ భవిష్యత్తుకు మంచి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీకి చెందిన 8 మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డి బల్దియా పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య సిబ్బందికి శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, వైస్ చైర్మన్ మత్తమల భాగ్యవతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారితో పాటు వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రత కోసం వారు నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. సిబ్బంది సంక్షేమానికి పురపాలక సంఘం ఎల్లప్పుడూ అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వీజ్ తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర ప్రజలకు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 3 సంక్షేమ పథకాల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చూడుతోంది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు, నూతన పింఛన్ల పంపిణీని రేపటి నుంచే ప్రారంభించనుంది. దీంతో పాటు అసంఘటిత రంగంలోని గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం తీసుకొచ్చిన చట్టాన్ని కూడా శనివారం నుంచి అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది.**

– అక్షరటుడే, ఎల్లారెడ్డి




# స్వాతంత్ర్య దినోత్సవాన మూడు కొత్త పథకాలు..

- స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త పింఛన్ల పంపిణీకి శ్రీకారం
- గిగ్ వర్కర్ల చట్టం అమల్లోకి..
- ఇప్పటికే జిల్లాలకు చేరిన రేషన్ కార్డులు

రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు అందజేసేందుకు వీలుగా క్యూఆర్ కోడ్‌తో కూడిన 1.06 కోట్ల లామినేటెడ్ పీడీఎస్ రేషన్ కార్డులను ఇప్పటికే జిల్లా కేంద్రాలకు తరలించారు. పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అధికారిక గణాంకాల ప్రకారం 2025 జనవరి 1 నాటికి రాష్ట్రంలో జాతీయ ఆహార భద్రతా చట్టం కింద 54,66,844 కార్డులు ఉన్నాయి. అలాగే రాష్ట్ర ఆహార భద్రత కింద 35,28,438 కార్డులు కలిపి మొత్తం 89,95,282 కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 2,81,47,565 మంది లబ్ధిదారులు ఉన్నారు. 26 జనవరి 2025 నుంచి 21 జూలై 2026 మధ్య 16,32,810 కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు పాత కార్డుల్లో 20,27,519 కొత్త సభ్యుల పేర్లను చేర్చారు.

### కామారెడ్డి జిల్లాకు 2.97 లక్షల కార్డులు

సుమారు 12 ఏళ్ల తర్వాత కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధమైంది. కామారెడ్డి జిల్లాకు ఇప్పటికే 2,97,293 స్మార్ట్ కార్డులు చేరినట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం 597 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆహార భద్రత కార్డులు 2,34,730, అంత్యోదయ కార్డులు 17,664, అన్నపూర్ణ కార్డులు 901 ఉన్నాయి. ప్రభుత్వం నుంచి తుది మార్గదర్శకాలు రాగానే పంపిణీ చేయనున్నారు.

### కామారెడ్డి జిల్లాలో చేయూత పింఛన్లు..

జిల్లాలో జూన్ 2026 నెలకు సంబంధించి మొత్తం 1,58,058 మందికి రూ. 35.37 కోట్ల పింఛన్లు పంపిణీ చేయనున్నారు. డీఆర్‌డీఏ పరిధిలో 1,55,344 మందికి రూ. 34.82 కోట్లు ఇవ్వనున్నారు. అలాగే 45,976 మందికి వృద్ధాప్య పింఛన్లు, 49,602 మందికి వితంతు పింఛన్లు, 17,106 మందికి వికలాంగుల పింఛన్లు, 529 మంది చేనేత కార్మికులు, 720 మంది గీత కార్మికులు, 36,543 మందికి బీడీ కార్మికులకు సాయం ఇవ్వనున్నారు. అలాగే 4,583 మందికి ఒంటరి మహిళల పింఛన్లు, 285 మంది బీడీ టేకేదార్లకు పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. అలాగే డీఎంహెచ్‌వో 1,969 మంది ఏఆర్‌టీ బాధితులు, 526 మంది ఫైలేరియా బాధితులకు, 219 మంది డయాలసిస్ బాధితులకు ఈ పింఛన్లు అందించనున్నారు. వృద్ధాప్య పింఛనుదారుల మరణానంతరం వారి జీవిత భాగస్వాములకు తక్షణమే పింఛన్ మంజూరు చేస్తున్నారు. దివ్యాంగుల పింఛన్ల కోసం యూడీఐడీ క్యాంపులు నిర్వహిస్తున్నారు. కొత్తగా 2.5 లక్షల పింఛన్లకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వీరిలో 6 వేల మంది తలసేమియా, 1700 మంది సికిల్ సెల్ ఎనీమియా బాధితులు ఉన్నారు.

### 15 నాటికి గిగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డు

డెలివరీ బాయ్స్, రవాణా కార్మికుల భద్రత కోసం గిగ్ వర్కర్స్ చట్టాన్ని ఆగస్టు 15 నుంచే అమలు చేయాలని కార్మిక శాఖ నిర్ణయించింది. వేతన కోతలు, యాప్ అల్గారిథమ్స్‌తో పేమెంట్లు నిలపడం, కారణం లేకుండా ఐడీలు బ్లాక్ చేయడం, అనవసర కోతలపై అగ్రిగేటర్లకు అడ్డుకట్ట వేసేలా కొత్త చట్టంలో కఠిన నిబంధనలు తెచ్చారు. పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా జిల్లాస్థాయిలో మంత్రులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు, పింఛన్ ప్రొసీడింగ్స్ అందించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.




## బోధన్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ

**అక్షరటుడే, బోధన్:** పట్టణంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రతిఒక్క యువకుడు దేశభక్తిని పెంపొందించుకుని దేశ సమైక్యత కోసం పాటుపడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న దేశభక్తులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గోపి, బీజేపీ సీనియర్ నాయకులు కొలిపాక బాల్‌రాజ్, గుంత గంగాధర్, ఉషోదయ విద్యార్థులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు పరిహారం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నియోజకవర్గంలో విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం చెక్కులను ఎమ్మెల్యే మదన్ మోహన్ పంపిణీ చేశారు. లింగంపల్లి కలాన్‌కు చెందిన అల్లాపురం లక్ష్మి, మాచాపూర్‌కు చెందిన కొండా సునీత, సాతెల్లికి చెందిన ఎర్కల రవి కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు కుటుంబ సభ్యులను కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

## ఆలూర్ నూతన ఎంపీడీవోగా లక్ష్మారెడ్డి బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల నూతన ఎంపీడీవోగా వర్ని మండలం నుంచి బదిలీపై వచ్చిన లక్ష్మారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీవోకు స్వాగతం పలికారు. ఎంపీడీవో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. లక్ష్మారెడ్డిని కల్లడి సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

## అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలో జిల్లా విద్యాశాఖాధికారి దిష్టిబొమ్మను దహనం చేసి, అనంతరం రాస్తారోకో చేశారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలో ఎలాంటి అనుమతులు, నిరభ్యంతర పత్రాలు, మున్సిపల్ పర్మిషన్లు, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు లేకుండానే అనేక ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయని మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు విన్నవించినా డీఈఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇది సరికాదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి, విధులను సక్రమంగా నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజశేఖర్, కౌశిక్, వెంకటేష్, సాయితేజ, చరణ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల వ్యాపారులకు స్థలం కేటాయింపు

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులకు మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాసుల బాలరాజ్ ఆధ్వర్యంలో అధికారులు వ్యాపారులకు నెంబర్లు కేటాయించి, చైతన్య కాలనీకి వెళ్లే మార్గంలో విక్రయ స్థలాలను ఏర్పాటు చేశారు. కాసుల బాలరాజ్ మాట్లాడుతూ.. పాత బాన్సువాడకు వెళ్లే ప్రధాన మార్గంలో కూరగాయల బండీలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. ప్రజలు, వాహనదారులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకే చిరు వ్యాపారులకు ప్రత్యేకంగా స్థలాలను కేటాయించినట్లు తెలిపారు. వ్యాపారులు తమకు కేటాయించిన స్థలాల్లోనే విక్రయాలు నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ చర్యలకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్వల కృష్ణారెడ్డి, జంగం గంగాధర్, వార్డు కౌన్సిలర్ ఖాలెక్, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, కోఆప్షన్ సభ్యురాలు ఖమర్ సుల్తానా గౌస్, మున్సిపల్ అధికారులు సతీష్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 31న నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 31న నిజామాబాద్ జిల్లాలో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించనున్నట్లు నిజామాబాద్, కోరుట్ల ఇన్‌చార్జి డాక్టర్ రఘు, పార్టీ రాష్ట్ర నాయకులు నవీన్ చారి, పార్లమెంట్ ఇన్‌చార్జి ఆలీం భాయ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్ రఘు గారు మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన పార్టీ ఏర్పాటు అనంతరం తొలిసారిగా తన సొంత జిల్లా అయిన నిజామాబాద్‌కు కల్వకుంట్ల కవిత విచ్చేస్తున్న నేపథ్యంలో ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.






## కుట్టుమిషన్ల పంపిణీలో మేరు కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వడంపై హర్షం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మేరు కులస్తులకు కుట్టుమిషన్ల పంపిణీలో ప్రాధాన్యం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు దర్శనం దేవేందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నియోజకవర్గానికి వెయ్యి కుట్టు మిషన్లు బీసీ మహిళలకు పంపిణీ చేయనుందని దేవేందర్ పేర్కొన్నారు. అందులో సింహభాగం మేరు కులస్థులకు ఇవ్వాలని జిల్లా మేరు సంఘం ప్రతినిధులు అనేక పర్యాయాలు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను కలిశామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం మేరుకులస్తులకు కుట్టుమిషన్ల పంపిణీలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారని.. దీనికి మేరు కులస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా మేరు సంఘం ఉపాధ్యక్షులు కొట్టూర్ చంద్రకాంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘ నాయకులు మంతెన దశరథ్, ఎన్ను పండరి, విప్లవ కుమారి, అరుణ్ చంద్, దీకొండ లక్ష్మణ్, మాకుల్లా శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీ : ముగ్గురికి గాయాలు



**అక్షరటుడే, కామారెడ్డి:** హైదరాబాద్–నిజామాబాద్ జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొన్నాయి. రామారెడ్డి బ్రిడ్జి వద్ద శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన మరో కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడ్డవారిని వెంటనే కామారెడ్డి జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం అడవి తండాకు చెందిన బాలాజీ, పారుబాయ్, ఆమె కుమారుడు రాజేష్, సారంగపూర్‌కు చెందిన ఆశిస్, ఆయన భార్య ప్రతిభ, వారి రెండేళ్ల కుమార్తె శివాన్సీ కారులో ప్రయాణిస్తున్నారు. రామారెడ్డి బ్రిడ్జి వద్ద ముందు కారు ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో ఎక్సైజ్ ఉద్యోగి మృతి

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎక్సైజ్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కామారెడ్డి పట్టణంలోని ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని కల్కినగర్‌లో నివాసం ఉంటున్న మామిడి అనిల్ కుమార్(41) ఎక్సైజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆయన తన ఇంట్లో శుక్రవారం తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే అతడిని 108 అంబులెన్సులో జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అనిల్ కుమార్ మృతిపై ఆయన తల్లి ఇందిర అనుమానం వ్యక్తం చేశారు. అనిల్ కుమార్‌కు భార్య నీరజ, పిల్లలు శాన్వి, జాహ్నవి, రిషిత్ ఉన్నారు. తల్లి ఇందిర ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురికి తరలించారు. కాగా అనిల్ దోమకొండ ఎక్సైజ్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేవాడు.

## తల్లిదండ్రులను మించిన దైవం లేదు..




**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని.. వారిని మించిన దైవం లేదని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పేర్కొన్నారు. శుక్రవారం తన జన్మదినం సందర్భంగా ఆయన డోన్‌గావ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా డోన్‌గావ్‌లో తన తల్లికి పాదాభివందన చేసిన మాజీ ఎమ్మెల్యే ఆమె ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తల్లిదండ్రులకు సేవ చేస్తే దేవుడికి చేసినట్లేనన్నారు. వృద్ధాప్యంలో వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని డోన్‌గావ్ నుంచి జన్మదిన శోభాయాత్ర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సాగింది. జుక్కల్ చౌరస్తాలో గజమాలతో మాజీ ఎమ్మెల్యేకు కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం మద్నూర్ మండలంలోని సలాబాత్ పూర్ హనుమాన్ మందిరంలో హన్మంత్ షిండే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మైతలి ఫంక్షన్ హాల్‌లో కేక్ కట్ చేశారు. పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ స్థాయి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.